క్లుప్తంగా

వైభవంగా వారాహి అమ్మవారి గ్రామోత్సవం



పుష్పపల్లకీలో అమ్మవారు

కలికిరి: వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం కలికిరిలో వారాహి అమ్మవారు పుష్పపల్లకీలో పట్టణ పురవీధులలో విహరించారు. స్థానిక ఎల్లమ్మ ఆలయం నుంచి వాహారి అమ్మవారిని ప్రత్యేక పుష్పాలంకరణ తేరులో ఆర్.ఎస్.రోడ్డు, బ్రాహ్మణ వీధి, మెయిన్ బజారు, మసీదు వీధి వరకు అత్యంత వైభవంగా సాంప్రదాయ వాయిద్యాలైన మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ఇంటింటా అమ్మవారికి కొబ్బరికాయలు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. పీలేరు ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌రెడ్డి దంపతులు పుష్పపల్లకీ సేవకు ఉభయదారులుగా వ్యవహరించారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మదనపల్లె రూరల్: ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన ఆదివారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని దేవతానగర్ రెండవ క్రాస్‌కు చెందిన హైదర్‌వల్లి కుమారుడు నౌషాద్(30) తన పరిచస్తుడైన హరి(48)తో కలిసి ద్విచక్రవాహనంలో వెళుతుండగా బైపాస్ పుంగనూరు రోడ్డులోని టాటా షో రూం సమీపంలో వెనుకనుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

అభివృద్ధిమానేసి దళితులపై దాడులు



మాట్లాడుతున్న యమలా సుదర్శనం

మదనపల్లె సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అభివృద్ధి కార్యక్రమాలు మానేసి దళితులపై దాడులు పెరిగిపోయినట్లు మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం ఆరోపించారు. ఆదివారం మదనపల్లెలో మాలమహానాడు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దళితలను టార్గెట్ చేసి వారిపై దాడులు, హత్యలు, కేసులు నమోదు చేస్తున్నారన్నారు. కూటమిపాలనలో జరుగుతున్న అరాచకాలపై మాల కుటుంబ సభ్యులు అందరూ కలిసి నిరసన తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాయలసీమ కన్వీనర్ చంద్రయ్య, మల్లిమోహన్, గుండా మనోహర్, వెంకటస్వామి, సుధాకర్, లక్ష్మీపతి, శివయ్య, నాగార్జున, రామచంద్ర పాల్గొన్నారు.

129 మందికి వైద్య సేవలు

పీలేరు : స్థానిక ఏజె హాస్పిటల్‌లో మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. 129 మందికి వైద్య సేవలు అందించి మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు మేము సైతం సమాజం కోసం ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ షాహిన్‌షా తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.కె. అలీమ్, డాక్టర్ డి. జనీఫర్ మాట్లాడుతూ మేము సైతం ఫౌండేషన్ వారు సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు హసన్ బాషా, బుజ్జు, కలకడ బాబు, షాజహాన్, రిజ్వాన్, ఆదిల్, పఠాన్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం మండలంలోని కూరపర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పులి రామచంద్రారెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఆదివారం ఆయన స్వగ్రామం కూరపర్తిలో ఉత్తరక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కూరపర్తికి చేరుకుని పులి రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలు వేసి ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతల శివానందరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

ఖాళీలతో పడకేసిన పురపాలన

- మదనపల్లెలో 2 లక్షలకు పైబడిన జనాభా
- ఏసీపీ పోస్టు, అసిస్టెంట్ కమిషనర్, ఈఈ పోస్టులు ఖాళీ
- పాలన, పర్యవేక్షణంతా కమిషనర్‌పైనే భారం
- భర్తీకి నోచుకోని ఒక టీపీఎస్, ఆర్ఓ పోస్టులు



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

మదనపల్లె: సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ అయిన మదనపల్లె పట్టణం రోజురోజుకు విస్తరిస్తుంటే దానికి తగ్గట్టు పాలన, అధికారుల సంఖ్య పెరగాల్సి ఉండగా అందుకు భిన్నమైన పరిస్థితులతో మున్సిపల్ పాలన పడకేస్తోంది. అధికారి స్థాయి వ్యక్తి పరిశీలించి తీసుకోవాల్సిన నిర్ణయాలను కిందిస్థాయి ఉద్యోగులు నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు నెలకొంటున్నాయి. వాస్తవ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయకపోగా ఉన్న పోస్టుల్లోని ఉద్యోగులను బదిలీ చేయగా ఖాళీలను భర్తీ చేయకుండా వదిలేసింది. దీనితో మున్సిపల్ పాలన, కార్యకలాపాలకు ఇబ్బందికరంగా మారింది. మున్సిపాలిటీకి ఇవ్వాల్సిన అసిస్టెంట్ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఇంజినీరింగ్ విభాగం ఈఈ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం వదిలేసింది. దీనితో మున్సిపాలిటీ పాలన కిందిస్థాయి ఉద్యోగులతో..వారు లేకుంటే వారికంటే దిగువ స్థాయి ఉద్యోగులతో విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉండాల్సింది సిటీ ప్లానర్

మదనపల్లె పట్టణ జనాభా స్థాయి మేరకు మున్సిపాలిటీకి అసిస్టెంట్ సిటీ ప్లానర్ పోస్టు ఉంది. అయితే ప్రభుత్వం దీన్ని భర్తీ చేయకుండా వదిలేసింది. దీనితో ఇప్పటికి టౌన్‌ప్లానింగ్ అధికారి హోదా కలిగిన పోస్టుతోనే పట్టణ ప్రణాళిక విభాగం నెట్టుకొస్తోంది. రెండు లక్షలకు పైబడిన జనాభా, 2011 లెక్కల ప్రకారం 33,136 గృహాలుండగా ప్రస్తుత జనాభా, ఇళ్ల సంఖ్య గణనీయంగా ఉండగా కొత్తగా ఇళ్ల నిర్మాణాలు, పారిశ్రామిక అభివృద్ధి, లేఅవుట్లు పెరుగుతున్నాయి. దీనికి అనుగుణంగా మున్సిపాల్ పాలనలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. దీని పర్యవేక్షణ, పట్టణ ప్రణాళిక బాధ్యతలను అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉంది. అయితే సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీకి ఇంకా టౌన్‌ప్లానింగ్ అధికారి పర్యవేక్షణలో సాగడం అభివృద్ధిలో వెనక్కు వెళ్లినట్టుంది. ఈ పోస్టు భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటే మున్సిపాలిటి స్థాయికి తగ్గట్టుగా ఉంటుంది.

అసిస్టెంట్ కమిషనర్ పోస్టు లేదు

మున్సిపాలిటికి అసిస్టెంట్ కమిషనర్ పోస్టును భర్తీ చేయాల్సి ఉంది. ఈ పోస్టును భర్తీ చేసేందుకు ప్రభుత్వం నుంచి నిర్ణయం లేదు. సాధారణంగా మదనపల్లె లాంటి పెద్ద మున్సిపాలిటిల్లో కమిషనర్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్‌ను నియమిస్తారు. కమిషనర్ విధులు నిర్వహిస్తే..అసిస్టెంట్ కమిషనర్ పాలనాపరమైన విధులను నిర్వహిస్తారు. దీనితో భారమంతా కమిషనర్‌పై పడకుండా పని విభజన జరుగుతుంది. దీనితో పాలనలో పారదర్శకత, సత్వర సమస్యల పరిష్కారం, ఫిర్యాదులపై చర్యలు, ఫైళ్ల కదలికలో వేగం ఉంటుంది. ప్రస్తుతం విధులన్నీ కమిషనర్ ఒక్కరే చూసుకోవాల్సి వస్తోంది. దీనితో ఫైళ్ల పరిష్కారం, సమస్యలపై చర్యలు, కార్యాలయ పాలన, పర్యవేక్షణ, పర్యటనలు, సమావేశాలు అన్ని పనులు ఒక్కరే చూసుకోవాల్సి వస్తూ భారంగా మారింది.

ఈఈ పోస్టు అంతే..

మదనపల్లె మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ విభాగానికి చెందిన కీలకమైన ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ పోస్టు ఖాళీగా ఉంది. మున్సిపల్ కార్యకలాపాల్లో ఈ పోస్టు ముఖ్యమైనది. ఈ విభాగం ద్వారా ఏటా కోట్ల విలువైన పనులు, ఇతరా కార్యకలాపాలపై పర్యవేక్షణ ఈఈ ఆధ్వర్యంలో జరగాలి. అయితే అయినప్పటి డీఈ స్థాయి అధికారితోనే కార్యకలాపాలు సాగుతున్నాయి. మున్సిపల్ బడ్జెట్‌లో అధిక నిధుల వినియోగంలో ఇంజినీరింగ్ విభాగం ముందుంది. ఈ పనులపై పర్యవేక్షణ, పాలనాపరమైన భారం అధికమై ఉన్న ఉద్యోగులు సతమతమవుతున్నారు. ఈఈ పోస్టును ప్రభుత్వం భర్తీ చేస్తే మున్సిపాలిటీకి ఎంతో ఊరట. దానికితోడు పాలనాపరమైన సౌలభ్యం కలుగుతుంది.

మరో రెండు కీలక పోస్టులు అంతే..

పట్టణానికి ముఖ్యమైన రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్, రెవెన్యూ విభాగానికి ముఖ్యమైన రెవెన్యూ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మున్సిపల్ పాలనలో ఆర్ఓ పోస్టు కీలకమైనది. అయినప్పటికి వీటి భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం కొత్త పోస్టుల భర్తీ, ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటే మున్సిపల్ పాలన సౌలభ్యమై ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి.

నవోదయం 2.0 తో సారాకు అడ్డుకట్ట

- ఎక్సైజ్ సీఐ భీమలింగ
- నాలుగు సారారహిత గ్రామాలు ఎంపిక



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

మదనపల్లె రూరల్: నవోదయ 2.0 తో గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి సారాకు అడ్డుకట్ట వేస్తామని మదనపల్లె ప్రొహిబిషనల్ అండ్ ఎక్సైజ్ సీఐ భీమలింగ అన్నారు. ఆదివారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు మదనపల్లె మండలంలోని కె.ఎం.సి తండా, తుమ్మలతండా, దాదినాయునిదొడ్డితండా, సి కేటగిరిగా గుర్తించిన చెంబకూరు హరిజవాడలను సారారహిత గ్రామాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులచే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమాల్లో భాగంగా సారారహిత గ్రామాల్లో విస్తృత్తంగా నాటుసారా వల్ల కలిగే కష్ట,నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత గ్రామాల్లో సారా తయారీ,సారా విక్రయాల తదితర కేసుల్లోని పాత ముద్దాయిలు, అనుమానితులను బైండోవర్ చేస్తున్నామన్నారు. మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారుల సమన్వయంతో సారా గ్రామాల్లో లేకుండా చేసేందుకు తగిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎక్సైజ్, పోలీసు,రెవిన్యూ,ఫారెస్టు అధికారులు ,ఎస్‌హెచ్‌జీ సభ్యులు, గ్రామ పెద్దలతో కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల సమక్షంలో సారారహిత గ్రామాల్లో సారా అరికట్టేందుకు పూర్తిస్థాయిలో పని చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత గ్రామాల్లో సారా విక్రయం,రవాణా తదితర సమాచారం టోల్‌ఫ్రీ నంబర్ 14405 కుగాని ఎక్సైజ్ అధికారులకు, పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎస్ఐలు జబీవుల్లా, దార్కస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరానికి స్పందన



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

మదనపల్లె రూరల్: భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) ఆధ్వర్యంలో నిర్వహించిన 20వ ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని అమ్మచెరువుమిట్ట మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం బాస్ వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో నారాయణ హృదయాల కోలార్ బ్రాంచికి చెందిన ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ రోగులను పరీక్షించారు. శిబిరంలో 176 మందికి బీపీ,షుగర్, ఈసీజీ, ఏకో తదితర గుండె పరీక్షలు నిర్వహించారు. 11 మందికి గుండె జబ్బులు నిర్ధారణ కావడంతో ఆపరేషన్లకు రెఫర్ చేశారు. కర్నాటక రాష్ట్రం నారాయణ హార్ట్‌సెంటర్‌లో ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. వైద్యులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గుండెజబ్బులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కనీసం ఏడాదికి ఒకసారి పూర్తిస్థాయిలో ఆరోగ్యపరీక్షలు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు బాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 5309 మందికి ఉచితంగా గుండె వైద్య పరీక్షలు నిర్వహించామని 537 మందికి ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్లు చేయించినట్లు పీటీఎం శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య వ్యవస్థాపకులు కోనేటి దివాకర్, బాస్ నాయకులు ముత్యాల మోహన్, నీరుగట్టి రమణ, టీ.ఎ.పీర్‌బాషా, గంగాధర్, గంపల రమణ, తలారి క్రిష్ణ, జనార్థన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

–ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిన తీరుపై వైఎస్సార్‌సీపీ చేపడుతున్న రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యపరచాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. ఆదివారం కన్నెమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లెలో దయ్యాల వేమారెడ్డి స్వగృహంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికి శాలువలతో సన్మానించారు. అనంతరం స్థానిక నాయకులతో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అందరూ వైషమ్యాలు వీడి ఐక్యంగా ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిందేనన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అన్ని వర్గాల ప్రజలను మోసగించిన తీరుపై వివరించాలన్నారు. ఐక్యంగా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు రామకృష్ణారెడ్డి, రవిశంకర్ రెడ్డి, రెడ్డప్పరెడ్డి, మంజునాథరెడ్డి, రవీంద్రరెడ్డి, తాళ్ల చంద్రశేఖర్, రామశంకర్‌రెడ్డి, శివారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన రమణ

మదనపల్లె రూరల్ : ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లి పంచాయతీ ఆచార్లపల్లెకు చెందిన రమణ(35), ప్రైవేటు పాఠశాల స్కూల్ బస్సు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చి తిరిగి వెళుతుండగా, బైపాస్ రోడ్డు వై జంక్షన్ వద్ద ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో రమణ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఏసీ పోస్టులకు నిబంధనలు వర్తించవా?



మహిళా సమాఖ్య భవనం

మదనపల్లె: వెలుగు సమాఖ్య నియోజకవర్గ ఏరియా కోఆర్డినేటర్ల పోస్టులకు నిబంధనలు వర్తించవా అని గ్రామీణాభివృద్ధి సంస్థ ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. మదనపల్లె డివిజన్‌లోని తంబళ్లపల్లె, మదనపల్లె, రాయచోటి డివిజన్‌లోని పీలేరు నియోజకవర్గాలకు వెలుగు కార్యకలాపాల పర్యవేక్షణకు ఏరియా కోఆర్డినేటర్లను ప్రభుత్వం నియమిస్తోంది. ఇది మొదటి నుంచి అమలులోని వ్యవస్థే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పోస్టుల భర్తీ విషయంలో నిబంధనలు పాటించకుండా జూనియర్లకు అవకాశం కల్పించారని సీనియర్లు, అర్హులైన ఏపీఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీజీ విద్యార్హతతో సీసీలుగా ఉద్యోగాల్లో చేరిన వారు ప్రస్తుతం ఏపీఎంలుగా ఉన్నవారిని, ఉన్నతవిద్యను అభ్యసించిన అర్హులను ఏసీ పోస్టులకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఈ పోస్టులకు రెగ్యులర్ ఏసీలను నియమించకపోవడంతో మూడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్ ఏసీలను జిల్లా అధికారులు నియమించారు. అయితే సీనియారిటీ ఉండి, ఉన్నత విద్యను రెగ్యులర్‌గా అభ్యసించిన వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇన్‌చార్జ్ ఏసీలుగా నియమించాలి. అయితే తక్కువ అర్హత, జూనియర్లను ఏసీలుగా నియమించడంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని కొందరు నిర్ణయించినట్టు తెలిసింది. దీనితో ప్రస్తుతం ఈ మూడు నియోజకవర్గాల్లో ఏసీ పోస్టుల నియామక వ్యవహారం డీఆర్‌డీఏలో హాట్‌టాపిక్‌గా మారింది.

ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత

– నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



రాచవేటివారిపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకులతో నిసార్ అహ్మద్

నిమ్మనపల్లె: అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగి, వైఎస్సార్‌సీపీపై సానుకూలత ఏర్పడటమే కాకుండా ప్రజల్లో పశ్చాత్తాపం మొదలైందని వైయస్సార్సీపీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త నిసార్ అహ్మద్ అన్నారు. ఆదివారం మండలంలోని రాచవేటివారిపల్లిలో ప్రతాప్ కుమార్ రెడ్డి, రామకష్ణ రెడ్డి, శేఖర్ రెడ్డి ఆహ్వానం మేరకు నూతన గృహప్రవేశ ప్రారంభోత్సవంలో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన నిమ్మనపల్లె మండల నాయకులను పేరుపేరునా పలకరించారు. ఈ సందర్భంగా నాయకులతో మాట్లాడుతూ మండలంలో పార్టీ పటిష్టతపై చర్చించారు. కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు దృష్టి సారించాలన్నారు. పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ వ్యతిరేకతను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాల తీరు, ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల తీరుపై ప్రజలకు వివరించాలన్నారు. కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్న వైనంపై కార్యకర్తలు ప్రతి ఇంటిలో అవగాహన పెంచాలన్నారు. ఏడాది కాలంలో కక్షపూరితంగా వైఎస్సార్ సీపీ నాయకులు పై కేసులు పెట్టి వేధించడం, మహిళలు చిన్నారులపై పెరిగిన అఘాయిత్యాలు, సచివాలయ వ్యవస్థ విద్యా రంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుండడంపై ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, నియోజకవర్గ మాజీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజ, బాబు రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామకృష్ణా రెడ్డి, షావల్లి, కొత్తపల్లె మహేష్ , రిటైర్డ్ ఏఈ రమణయ్య, బషీర్ అలీ, రమణారెడ్డి, సాధిక్, జబీవుల్లా, యాసిన్, అబ్దుల్లా పాల్గొన్నారు.

తప్పుపడుతున్న ఎండీయూ వాహనం



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న ఎండీయూ వాహనం

గుర్రంకొండ: వేలాది మందికి రేషన్‌బియ్యం సరఫరా చేసిన ఎండీయూ వాహనాలు తుప్పుపట్టిపోయిన శిథిలావస్థకు చేరుకొంటున్నాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో ఏడాదిగా ఎండీయూ వాహనం నిరుపయోగంగా పడి ఉంది. నెలల తరబడి ఎవరూ వినియోగించక పోవడంతో వాహనం రోజురోజుకు తుప్పపట్టిపోతోంది. వాహనాల వినియోగం కాలంలోనే నిరుపయోగంగా ఇక్కడ ఉంచేశారు. ప్రస్తుతం వాహనాల వ్యవస్థను రద్దు చేయడంతో ఏంచేయాలో దిక్కుతోచక అధికారులు వాహనాన్ని అలాగే కార్యాలయం పక్కనే పడేశారు. ఎండీయూ వాహనానికి వచ్చిన దుస్థితి చూసి తహసీల్దార్ కార్యాలయంకు వచ్చే ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

ప్రధానోపాధ్యాయుల సేవలు ఆదర్శనీయం



హెచ్ఎం సురేంద్రనాథరెడ్డిని సన్మానిస్తున్న ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి

పీలేరు రూరల్ : పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుల సేవలు ఆదర్శనీయమని ఎంఈవోలు పి. లోకేశ్వర్‌రెడ్డి, బి. పద్మావతి అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో పీలేరు మెయిన్ స్కూల్ హెచ్ఎంగా పని చేస్తున్న పదవీ విరమణ పొందిన ఆర్. సురేంద్రనాథరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే అయ్యప్పరెడ్డి కాలనీలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఫౌజియా బేగంకు సన్మాన కార్యక్రమం అదే పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎంఈవోలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన హెచ్ఎంల శేషజీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో పులిచెర్ల ఎంపీపీ సురేంద్రరెడ్డి, సదుం జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపడతాం

మదనపల్లె సిటీ: మానవత సంస్థ ఆధ్వర్యంలో సామాజిక, సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని ఆ సంస్థ డివిజన్ చైర్మన్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో మానవత సంస్థ సమావేశం నిర్వహించారు. సంస్థలో సభ్యులను చేర్చుకోవాలన్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు ఎస్.శివారెడ్డి మాట్లాడుతూ త్వరలో మదనపల్లెలో ఉచిత గుండె వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, క్రిష్ణప్ప, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు విస్తృతం చేస్తాం



ప్రమాణం చేస్తున్న మానవత సభ్యులు

పీలేరురూరల్ : మానవత సంస్థ సేవలు మరింత విస్తృతం చేస్తామని సంస్థ అధ్యక్షులు శెట్టిసుబ్రమణ్యం, చైర్మన్ రామచంద్ర అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో మానవత సంస్థ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ముమ్ముందు వివిధ సేవా కార్యక్రమాలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కో చైర్మన్ కృష్ణమూర్తి, జి.వి. రమణ, అశోక్, హరికుమార్, అక్రమ్‌బాషా, నాగరాజ, పోతంశెట్టి రమేష్, రెడ్డెప్ప, సిద్ధప్ప, ఖలీల్‌బాషా, సుధాకర్,బాషా, ఆంజినేయులుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

తంబళ్లపల్లె: మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి హెచ్చరించారు. ఆదివారం కురవపల్లె బస్టాపు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. కొందరు మైనర్లు వాహనాలు నడుపుతుంటే వారిని నిలిపి కౌన్సెలింగ్ ఇచ్చారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, ద్విచక్రవాహనం నడిపే వారు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. ఫోర్‌వీలర్లు నడిపేవారు సీటుబెల్టు తప్పక పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు.